శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

# కిష్కింధాకాండ

## మందర మకరందం

వక్త

ఆంధ్ర వాల్మీకి - కవి సార్వభౌమ

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహారావు



ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

**కిష్కింధాకాండ మందరమకరందం**


వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త–వాచవి

వనం జ్వాలా నరసింహారావు



ప్రథమ ముద్రణ

జులై 2019

ప్రతులు 1000

వెల: రు. 300

ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్ : **శ్రీనివాసరావు త్రిపురాన**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్,**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:

**మరుమాముల వెంకట రమణ శర్మ**

**దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక**

శ్రీరామసిద్ధాంతి భవనం, 29–105/4/1,

న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్,

సికిందరాబాద్–5000 56

ఫోన్: 94410 15469, 040–27220401

# శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం... కిష్కింధాకాండ

శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు."చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకులవారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశ లవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ–జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య–వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని–అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ–పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మధనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన-అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం-మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే-పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ-పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది-ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య-ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి

# రామాయణంలో ఏముంది..
## ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణానికివాసుదాసుగారి పీఠిక

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. వేద వేదాంత అర్థోపబృంహితంబులు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. శ్రీమద్రామాయణం–ఉత్తర కాండ 94వ సర్గలో చెప్పినట్లు రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. (రామాయణ తత్వాన్ని తనకు తెలిసినంత వరకు ఆంధ్ర వాల్మీకంలో చెప్ప సాహసించానని, తన ఆ సాహసానికి క్షమించమని వాసు దాసు గారు పాఠకులకు విజ్ఞప్తి చేశారు).

మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులా చార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లి తండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలాఆరాధిస్తుండేవారు? ఇలాంటిలౌకికవిషయాలనుతెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు.

జనన మరణ చక్ర బంధంలో ఇరుక్కొని, పరిభ్రమిస్తూ, ఆ బాధ తొలగించుకునేందుకు పారలౌకిక చింత కలిగి, నిరామయమై- నిత్యమై- నిర్మలమైన పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, కరతలామలకంగా సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. కాబట్టి, ఇహ-పర లోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం.

భరత ఖండంలో శైవులని, వైష్ణవులని, శాక్తేయులని భిన్న మతాల వారున్నారు. అయితే వీరిలో కొందరు వైష్ణవులకు శైవుడంటే ఇష్టం లేకపోవడం, అలానే నారాయణుడి పేరంటే నే ముఖం చిట్లించుకునే శైవులుండడం అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ, శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సం పూజ్యులు కావడానికి కారణమేంటి? హరిశ్చంద్రుడి లాంటి సత్యాత్ములు, ధర్మరాజు లాంటి ధర్మాత్ములు, దమయంతి-సావిత్రి లాంటి పతివ్రతలు లేరా? వారి మీద ఎంత గౌరవం వున్నా లోకులు వారిని పూజించడం లేదే? మరి, సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే! ఎవరెవరు-ఏ ఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న-భిన్న రూపాల్లో దర్శనమీయుడం భగవత్ కళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోక రక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది. ప్రత్యక్షానుభవమున్న భక్తులే దానిలోని గూఢార్థాన్ని వెల్లడిచేయగల సమర్థులు- శక్తిమంతులు. అలాంటివాడైన వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, "కంఠోక్తి ఘోషించినాడు".

"శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అనిపేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని

# సర్గ-1
# అవతారిక

అరణ్యకాండలో దీనసంరక్షణ అనే ధర్మాన్ని రామచంద్రమూర్తి అనుష్టించి చూపించాడు. ఈ కాండలో మిత్ర రక్షణ, అనుష్టించి చూపుతున్నాడు. పూర్వకాండలో జటాయువు లాంటివారికి మోక్షమిచ్చి తన పరాత్పరత్వాన్ని వెల్లడి చేశాడు. ఈ కాండలో ఆయన అసంఖ్యాకమైన కళ్యాణ గుణాలు చెప్పడం జరుగుతుంది. ప్రథమ కాండలో శరణాగతి మంత్రం అందులోని సీతాకళ్యాణం ద్వారా వివరించబడింది. అయోధ్యాకాండలో సర్వజన వ్యామోహ విషయత్వం చెప్పి నారాయణ శబ్దార్థం వివరించడం జరిగింది. అరణ్యకాండలో పంచవటీ వాసపర్యంత వృత్తాంతంతో మునిజనులు చేసిన కైంకర్యం చెప్పడం వల్ల "నారాయణాయ" అనే పదంలోని చతుర్థీ విభక్తి అర్థం చెప్పడం జరిగింది. ఖరాది రాక్షసుల వధతో మంత్రంలోని ఉత్తరార్థంలో "నమ" అనే మూడో పదం అర్థాన్ని విశదీకరించి మారీచ దర్శనం మొదలు జీవుడు ఉజ్జీవించే ఉపాయం చెప్పడం జరుగుతుంది. శ్రీరామచంద్రమూర్తి సీతను వెతికాడు అనే కథ వల్ల భగవంతుడు జీవుడిని ఉజ్జీవింప చేసే ఉపాయ చింతన చెప్పడం జరిగింది.

కిష్కింధాకాండలో ఆ జీవుడి దగ్గరకు ఆచార్యుడు పంపంపడం జరిగిందని చెప్పబడింది. శ్రీరామచంద్రమూర్తి విలాపం పేరుతో, నిత్య కైంకర్యపరులైన నిత్య శూరులను చూసి, అయ్యో! జీవులందరూ వీరిలాగానే భోగానికి అర్హులై కూడా ఎందుకు కొందరు నన్ను చేర రావడం లేదనే భగవంతుడి క్లేశం ప్రథమ సర్గలో వర్ణించడం జరిగింది. కమలాల, కలువల, మీనాల సమూహంతో మిక్కిలి ప్రకాశించే సౌందర్య లక్ష్మితో కూడిన పంపా పుష్కరిణిని చూసి రామచంద్రమూర్తి తమ్ముడైన లక్ష్మణుడితో తన దుఃఖం చెప్పుకొని ఇలా పలికాడు.

(ఇక్కడ పంపను పుష్కరణి అని అనడం జరిగింది. అరణ్యకాండలో చెప్పిన దాన్ని బట్టి, ఇది పోల్చుకుంటే, పంప అనేది సరస్సా? నదా? అనే సందేహం కలగవచ్చు. ఏదేమైనా, ఇప్పుడిది ఎక్కడ వుందనేది తెలుసుకోవాలి. దీనికి దగ్గరలోనే కిష్కింధ వుండాలి. పంప నదా? సరస్సా? అనే విషయం రామాయణాన్ని బట్టి పరిష్కరించడం సాధ్యపడకపోవచ్చు. బహుశా అది కొంత భాగం నదనీ, కొంత భాగం సరస్సనీ నిశ్చయించవచ్చు. స్థలం పరిశీలించితే కాని ఈ ఊహకు బలం చేకూరుతుంది. పంప హంపి కూడా కావచ్చు. ఈ హంపి ఇప్పుడు బళ్లారి దగ్గర హోస్పేటలో వుంది. ఇప్పుడు తుంగభద్ర అని పిలిచే నదినే ఒకప్పుడు పంప అని పిలిచారంటారు కొందరు. తుంగభద్రా నదీ తీరంలో వున్న ఒకానొక శివ క్షేత్రంలో వున్న ఈశ్వరుడిని పంపాపతి అని పిలుస్తారు. హంస సందేశంలో శ్రీరామచంద్రమూర్తి తానుండేది మాల్యవంతమనే పర్వతం అనిచెప్పాడు. మాల్యవంతం బళ్లారి దగ్గరలోనే వుంది. ఇది చూసుకుంటూ తూర్పు పర్వతాల వెంట పోతే వేంకటాద్రి కనపడుతుందని హంసతో చెప్పినట్లు కథ వుంది).

పంపను చూసిన సంతోషంతో శ్రీరామచంద్రమూర్తికి సీతాదేవి జ్ఞాపకానికి వచ్చింది. సీతాదేవి కోసం తానెంత శోకిస్తున్నాడో, వెలవెలబోయి వున్నాడో అనే విషయాన్ని తనలాగే ముఖ చిహ్నాలున్న తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "వికసించిన కమలాలు, ఎర్ర కలువలు, వైదూర్యకాంతి కల నిర్మల జలాలు, ఆ నీటి ఒడ్డున నానా విధాలైన వృక్షాలు కల పంపను చూశావా సౌమిత్రీ ? శిఖరాలతో కొండలుండే రీతిగా ఎత్తైన కొమ్మలతో పంప చుట్టూ వున్న అడవుల్లోని చెట్లు పొగిడేవిధంగా వున్నాయి. ఊరి బయట కుటీరంలో ఉపవాసాలు, వ్రతాలు చేస్తూ కృషిస్తున్న భరతుడి కొరకు, సీత రాక్షసుల చేతికి చిక్కి బాధపడుతున్నందుకు, శోకపీడితుడనైన నన్ను వసంతుడు అధిక దుఃఖంలో ముంచాలని చూస్తున్నాడు. దుఃఖించే వాడికి సర్వం అసహ్యంగా కనిపించినట్లే, సీతాభరతులకై ఏడ్చే నాకు కూడా ఈ కొలను విచిత్ర వనంతో చుట్టబడి, తాపం హరించి, ధేహకాంతి కలిగించి, చల్లటి నీటితో, మిక్కిలి సంతోషంగా వుంది. పాములతో చుట్టబడి, మృగాలతో–పక్షులతో కూడి, కమలాలు, కలువలతో కప్పబడిన కొలను కనపడుతుంది చూశావా? లక్ష్మణా! అవే పచ్చిక పట్టులు. నీలం, పసుపు రంగుతో వుండడంతో, వాటిమీద చెట్లనుండి పూలు రాలడంవల్ల రత్న కంబళాల లాగా వున్నాయి".

## సర్గ-4

# హనుమంతుడితో తమ వృత్తాంతాన్ని చెప్పిన లక్ష్మణుడు

రామలక్ష్మణులు కార్యార్థమై సుగ్రీవుడిని చూడడానికి, కలవడానికి, స్నేహం చేయడానికి వచ్చారని సంతోషపడ్డ హనుమంతుడు, సుగ్రీవుడిని తలచుకుని, ఇక అతడి పని చక్కబడినట్లే అనీ, ఆయనకు రాజ్యం లభించడం సత్యమే అని అనుకుంటాడు. ఇలాంటి వారు పూనుకుంటే పని జరక్కుండా ఆగుతుందా? అని కూడా అనుకుంటాడు. ఆంజనేయుడు ఈ విధంగా ఆలోచించి, సుగ్రీవుడితో వీళ్లకేం పనుందో? అది అతడివల్ల సాధ్యమవుతుందా? కాదా? తెలుసుకుందామనుకుంటాడు. రామచంద్రుడిని చూసి, "అయ్యా! నువ్వు తమ్ముడితో ఈ భయంకర అరణ్యాలలో తిరగడానికి కారణం ఏంటి?" అని అడిగాడు. వెంటనే, రామచంద్రుడి ఆజ్ఞానుసారం లక్ష్మణుడు శ్రీరామచంద్రుడి చరిత్ర ఆదినుండి ఇలా చెప్పాడు.

"తేజోవంతుడు, గొప్ప మతిమంతుడు అయిన దశరథమహారాజు ధర్మం అంటే ప్రేమతో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలవారిని వారి-వారి స్వధర్మం చెడకుండా సర్వదా రక్షించేవాడు. ఆయన ఎవరికీ విరోదికాకుండా, ఎవరిమీద ఆయనకు విరోదిభావం లేకుండా, రెండవ బ్రహ్మలాగా రక్షించేవాడు. నియమం చెడకుండా అగ్నిష్టోమమ్ లాంటి యజ్ఞాలను దక్షిణలతో సహా నెరవేర్చేవాడు. ఆయన కొడుకుల్లో పెద్దవాడు శ్రీరాముడనే పేరుకలవాడు. పరాక్రమంలో ప్రసిద్ధికెక్కినవాడు. సర్వభూతాలను రక్షించే యోగ్యతకలవాడు. తండ్రిమాటను పాటించేవాడు. రాజచిహ్నాలతో కూడినవాడు. ఆయనే ఈ రామచంద్రుడు. ఈయన రాజ్యాన్ని పోగొట్టుకుని అడవులకు పోవడానికి సిద్ధపడగా నేను కూడా ఆయనకు తోడుగా వచ్చాను.

నేను ఒక్కడినే కాకుండా, ఆయన భార్య భూపుత్రి సీతాదేవి కూడా ఆయన వెంట అడవులకు వచ్చింది. ఆమె భార్య కాబట్టి రావడం న్యాయమే. నేనెందుకు వచ్చానంటావా? ఈ మతిమంతుడికి నేను జన్మతః తమ్ముడిని. ఆయన గొప్ప ధర్మబుద్ధికి, సద్గుణ సంపదకు వశపడి దాస్యం చేస్తున్నాను".

"నా పేరు లక్ష్మణుడు. నా యోగ్యతకు అది తగ్గపేరు. చేసిన మేలు మరవనివాడు, సుఖపడడానికి అర్హుడు, గొప్ప యోగ్యతకలవాడు, ప్రాణికోటులను రక్షించడంలో ఆసక్తికలవాడు, రాజ్యం లేనివాడు అయిన ఈ రాముడి ప్రియురాలిని, సీతాదేవిని, కామరూపైన రాక్షసుడు ఎవడో అడవుల్లో భయం లేకుండా దొంగిలించాడు. మేం ఆమెను వెతుక్కుంటూ అడవుల్లో తిరుగుతుంటే, ఒకచోట, శాపంవల్ల రాక్షసుడైన ఒకడు, సీతాదేవి జాడ తెలుసుకోవడానికి సుగ్రీవుడనే వానర రాజు సమర్థుడని, అతడి సహాయం తీసుకోమనీ చెప్పాడు. ఇలా చెప్పి అతడు స్వర్గానికి పోయాడు. ఇది వాస్తవంగా జరిగిన విషయం. ఈ కారణాన నాకు, రామచంద్రమూర్తికి, సుగ్రీవుడే ఇక దిక్కు వానరేంద్రా!. సర్వలోక రక్షకుడై, పూర్వం అనేక దానాలు చేసి, దాత అని పేరెన్నికగన్న రామచంద్రమూర్తి ఇప్పుడు తనకు సూర్యుడి కొడుకు దిక్కని అనుకుంటున్నాడు".

"దీనరక్షకుడు, అనేక ధర్మాలను రక్షించిన వాడు దశరథుడు. అలాంటివాడి కుమారుడు రక్షకుడైన వాడు కీసరాజు శరణుజొచ్చాడు హనుమంతా! లోకాలన్నిటికీ రక్షకుడు, శరణు చోర యోగ్యుడు, నా గురువు అయిన ఈ రామచంద్రమూర్తి సూర్యపుత్రుడి శరణు కోరగా వచ్చాడు. ఎవరి అనుగ్రహం వల్ల ఈ భూలోకంలోని జనులందరకీ సుఖం కలుగుతుందో, అలాంటి ప్రభువు శ్రీరామచంద్రమూర్తి వినయంగా కోతిరాజు అనుగ్రహం కోరుతున్నాడు. సమస్త సద్గుణ సంపత్తితో పూజ్యులైన రాజులు ఎవరితో గౌరవించబడుతున్నారో అలాంటి ఉత్తమదాత దశరథనందనుడు, రాముడు అని లోకంలో కీర్తికాంచినవాడు, క్రోతిరేడు శరణు కోరుతున్నాడు. మంచి కీర్తి సంపాదించిన యితడు శోకవశుడైసుగ్రీవుడి శరణుజొచ్చాడు".

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, రెండు కళ్లల్లో నీళ్లు కాలవల్లాగా కారుతున్న అతడిని చూసి, హనుమంతుడు, "ఈ పరాక్రమం, ఈ ఇంద్రియ జయం, ఈ బుద్ధి సంపద, ఇలాంటి సదాచార సంపత్తికల మిమ్మల్ని తన అదృష్టం కొద్దీ సుగ్రీవుడు చూశాడు. సజ్జన స్తోత్ర పాత్రమైన నడవడి కలవారా! ఇక సుగ్రీవుడి

# సర్గ-11
# వాలి బలపరాక్రమాలను శ్రీరాముడికి తెలిపిన సుగ్రీవుడు

తన దుఃఖం ఉపశమించేట్లు చేస్తానని శ్రీరాముడు చెప్పిన మాటలకు సంతోషించిన సుగ్రీవుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "అసమాన కీర్తీ! నువ్వు కోపంతో బాణాలను వదిలితే, అవి లయకాలంలోని సూర్యకిరణాల లాగా, లోకాలన్నిటినీ అల్పకాలంలో కాల్చి బూడిద చేస్తాయి. అయినప్పటికీ, వాలి ధైర్యం, ఆయన అద్భుత పరాక్రమం గురించి చెప్తాను. ఏకాగ్రచిత్తంతో విను. విన్నతరువాత ఎలాంటి ఉపాయం చేయాల్నో ఆలోచించి అలాగే చేయి. వాడు పెద్ద-పెద్ద కొండలను పైకి ఎత్తి చిన్నపిల్లలు గోలీలు ఆడినట్లు ఆడుతాడు. ప్రతిరోజూ సూర్యోదయం కాకముందే సంధ్యావార్చడానికి తూర్పు సముద్రంలో స్నానం చేసి, దక్షిణ సముద్రంలో ఆచమనం చేసి, పడమటి సముద్రంలో అర్ఘ్యం ఇచ్చి, మరో సముద్రంలో జపం చేసి, సూర్యోపస్థానం చేస్తాడు. ఇలా వాలి ప్రతిరోజూ నాలుగు సముద్రాలలో సంధ్యవారుస్తాడు. ఇంత తిరిగి వచ్చినా కొంచెమైనా అలసట వుండదు వాలికి. తన బలాన్ని ప్రదర్శించడానికి అడవిలోని పెద్ద-పెద్ద చెట్లను చేతిదెబ్బతో విరగ్గొట్టుతాడు. నిర్మలచిత్తా! అతడి బలం వర్ణించడం కష్టం".

### దుందుభి వృత్తాంతాన్ని శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

"వెండికొండ శిఖరంలాంటి తేజస్సుకల దుందుభి అనే మహిషస్వరూపంకల ఒక రాక్షసుడు, వరబలంతో వేయి ఏనుగుల బలం కలవాడై, సముద్రుడిని చూసి, తనతో యుద్ధానికి రమ్మని పిలిచాడు. వీడికి చేటుకాలం సమీపించినదని తలచిన సముద్రుడు, అతడితో యుద్ధం చేయడానికి తాను సరిజోడీకాదని, ఈశ్వరుడి మామ, కొండలరాజు, తపస్సు చేసేవారికి ఆశ్రయం ఇచ్చేవాడు,

అనేకమైన గుహలతో ప్రకాశించేవాడైన హిమవంతుడు దానికి సరిపోతాడని చెప్పాడు. సముద్రుడిని భయపడ్డాడని తలచాడుదుందుభి. యుద్ధాసక్తుడైన దుందుభి హిమవంతుడి మీదకు పోయాడు. ఇలా పోయి, తన కొమ్ముల బలంతో పెద్ద-పెద్ద బండలను నేలమీద పడవేయసాగాడు. అప్పుడు హిమవంతుడు తెల్లటి రూపంతో శిఖరం మీదనుండి వాడితో ఇలా అన్నాడు".

"రాక్షస శ్రేష్టుడా! నన్నెందుకు బాధపెట్టుతున్నావు? నువ్వేమో ధర్మాత్ముడివే? నేను మునులకు ఆశ్రయమిచ్చేవాడిని. నువ్విలా చేస్తే వాళ్లకు హాని చేసినట్లేకదా?". హిమవంతుడి మాటలకు జవాబుగా దుందుభి, "నువ్వు భయపడితే, నాతో యుద్ధం చేయగలవాడి పేరు చెప్పు" అని అంటాడు. హిమవంతుడు "మహాధైర్యవంతుడు, బలవంతుడు, ఇంద్రుడితో సమానమైనవాడు, చాలా బుద్ధిమంతుడు, వాలి అనే వానరుడు కిష్కింధలో వున్నాడు. అతడు నీతో సంతోషంగా ద్వంద్వ యుద్ధం చేస్తాడు. యుద్ధం చేయాలని నీకు కోరిక వుంటే అతడిమీదకు యుద్ధానికి పో. అతడు వెంటనే నిన్ను చక్కగా చేస్తాడు. నముచికి యుద్ధ బిక్ష ఇంద్రుడు ఇచ్చినట్లు, నీకు వాలి ఇస్తాడు" అని వాలి దగ్గరకు పొమ్మంటాడు దుందుభిని.

## వాలిమీదకు యుద్ధానికి పోయిన దుందుభి

"పాపాత్ముడైన దుందుభి రాక్షసుడు రోషంగా, గర్వంగా, కళ్ళు మూసుకుపోగా, కాళ్ళ తొక్కిడితో భూమి వణకుతుంటే, కిష్కింధకు పోయి, మహిష స్వరూపం ధరించి, వాడి కొమ్ములతో ఏనుగులాగా చెట్లను, నగరం బైటున్న తలుపులను చీల్చాడు. విచ్చలవిడిగా ఆ రాక్షసుడు చెవులు దద్దరిల్లేట్లు నగారాలాగా మధ్య-మధ్యన పెద్ద ధ్వని చేశాడు. అంతఃపురంలో వున్న వాలి ఈ చప్పుడు విని స్త్రీలతో సహా బయటకు వచ్చి ఆ రాక్షసుడితో, ఆతడు దుందుభి అని తనకు తెలుసనీ, దనుజ శ్రేష్టుడైన ఆతడు ఎందుకు ఈ విధంగా బుద్ధిలేకుండా తన పట్టణం వాకిట్లో ధ్వని చేస్తున్నాడనీ, అతడికి ఉపిరితో జీవించి వుండాలన్న ఆశ లేదా అనీ, వుంటే మరెక్కడికైనా పొమ్మనీ అంటాడు".

జవాబుగా దుందుభి, "వాలీ, ఆడవారి ఎదురుగా పౌరుషపు బింకాలు పలకగానే వచ్చిన లాభం ఏంటి? నువ్వు పరాక్రమంకలవాడివైతే, యుద్ధానికి రా. నీ భుజబలం ఎలాంటిదో అప్పుడు తెలుస్తుంది. అలా కాకపోతే ఉదయం దాకా వేచి వుంటాను. నీ ఇష్ట భార్యలతో అప్పటిదాకా సుఖపడు. నువ్వు ఇంటికి

## సర్గ–18

# వాలి దూషణలకు సమాధానం చెప్పిన శ్రీరాముడు

వాలి తనను దూషించిన వాక్యాలకు శ్రీరామచంద్రుడు సమాధానం చెప్పాడు. దీనికొరకే వాలి వెంటనే మరణించే విధంగా బాణం వేయకుండా కొన ఉపిరి వుండేట్లు వేశాడు రాముడు. వాలి చనిపోయేట్లు బాణం వదులుతే రామచంద్రమూర్తి వాలిని వధించడానికి కారణం తెలియక లోకులు ఆయన్ను పలురకాలుగా నిందించి వుండేవారు. రాముడు తగిన సమాధానం చెప్పినప్పటికీ కొందరు దుష్టులు ఇప్పటికీ ఆయన్ను నిందిస్తూనే వున్నారు కదా!

ధర్మార్థయుతంగా, హితంగా, కఠినంగా, అవివేకంగా వాలి పలికిన మాటలకు, కాంతిలేని సూర్యుడిలాగా, నీళ్లులేని మబ్బులాగా, చల్లారిన అగ్నిలాగా భూమ్మీదపడివున్న ఆ వానరశ్రేష్టుని చూసి ధర్మార్థ గుణ సహితంగా రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "ఓయీ! ధర్మమని, అర్థమని పలికావు. సంతోషమేకాని ధర్మం ఏవిధంగా ఆచరిస్తే పురుషార్థమవుతుంది? ఎప్పుడు అది పురుషార్థం కాదు? అర్థం, కామం ధర్మంతో కూడి వుండేట్లు చేయాల్నా? ఈ విషయం నువ్వు ఆలోచించావా? పోనీ కుల సంప్రదాయం అంటావా? శాస్త్ర విషయంలో సందేహం వస్తే శిష్టాచారం కదా ప్రమాణం? అది ఎలా వుందో ఆలోచించావా? ఏ ఆలోచన చేయకుండా పిల్లతనంగా నన్ను దూషిస్తే నీకు కలిగే లాభం ఏమిటి? పోనీ నువ్వు అడవిలో వుండేవాడివు కాబట్టి నీకు ధర్మశాస్త్రం ఎలా తెలుస్తుందంటావా? తెలుసుకోక పోవడం నీ తప్పు. (ignorance of law no excuse). నువ్వు కులగురువులనో, కులంలో పెద్దలనో, శాస్త్రం తెలసిన పండితులనో, ఆచార శుద్ధులనో అడిగావా? ఎందుకు అడగలేదు? ఇదంతా ఆలోచించకుండా కోతులకున్న స్వాభావ చపల బుద్ధివల్ల

నన్ను దూషిస్తే లాభం ఏంటి?".

"ఓయీ! కొండలతో, అడవులతో, తోటలతో, తోపులతో కూడిన ఈ భూమంతా ఇక్ష్వాకుల కాలం మొదలు ఇప్పటిదాకా మా వంశంలో పుట్టిన రాజులదని నీకు తెలుసా? ఈ కారణాన నువ్వు ఇక్ష్వాకు వంశంవారికి సామంతరాజువేకాని స్వతంత్ర ప్రభువువు కాదు. ఇలా వాళ్లు సార్వభౌములైనందువల్ల వారి రాజ్యంలోని సమస్త జనులను, మృగాలను, పక్షులను కూడా రక్షించడానికి, శిక్షించడానికి వారికి అధికారం వుందని తెల్సుకో. సత్యమే అయినా నేను రాజును కాదంటావేమో? నిజమే. నేను రాజును కాదుకాని ధర్మార్థకామాలను, దేన్ని ఎప్పుడు అనుష్టించాలో ఆ రహస్యం తెలుసుకుని దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి శక్తికలిగిన భరతుడు నేడు పాలిస్తున్నాడు. అతడే సత్యం, నీతి, వినయం,శౌర్యం కలిగి దేశకాల స్థితులెరిగిపాలిస్తున్నాడు. ఆయన ఆజ్ఞతో ప్రపంచంలో ధర్మాన్ని కాపాడే కోరికతో, అది ప్రమాదపడకుండా చూడడానికి నేను మరికొందరు రాజులు భూమ్మీద తిరుగుతున్నాం. నిశ్చల స్వభావుడైన భరతుడు రాజ్యం ఏలుతుంటేఎవడు అధర్మం చేయగలడు? చేస్తే శిక్షపడదా?"

"ఈ విధంగా ధర్మరక్షణ కొరకు తిరిగే మేం స్వధర్మాన్ని తప్పకుండా భూమ్మీదకల అధర్మాత్ములను భరతుడి ఆజ్ఞమేరకు దండిస్తాం. ఇది తప్పా? చెప్పు. నువ్విప్పుడు ఏవిధమైన అధర్మం చేశావని నేను నిన్ను శిక్షించానంటావా? చెప్తా విను. నువ్వు ధర్మాన్ని వదిలి కఠినమైన, నింద్యమైన కార్యం చేస్తూ అధర్మయుక్తమైన కామాన్నే ప్రధానంగా స్వీకరించి రాజధర్మాన్ని తప్పావు. ఇది నీకు తగునా? నీ నడవడి గురించి నువ్వు ఆలోచించకుండా ఇతరులను గర్వంతో ఎందుకు దూషిస్తావు? నువ్వే ధర్మాన్ని తప్పి నడిచానంటావా? చెప్తా విను. ధర్మమే ప్రమాణమైతే, కన్న తండ్రి, అన్న, విద్యనేర్పిన గురువు ధర్మపథంలో ఉన్నవారికి కన్న తండ్రులతో సమానమే సుమా! అలాగే సద్గుణాలున్న తోడబుట్టినవాడు, సద్గుణాలు కల శిష్యుడు, సద్గుణాలు కల తన కన్నకొడుకు, ముగ్గురూ కన్నకొడుకు లాంటివారే".

"ఓయీ! కన్నతండ్రి అన్న ఎలా అవుతాడు? అన్న తండ్రి ఎలా వుతాడు? చదువు చెప్పినంత మాత్రాన గురువు తండ్రి అవుతాడా? అంటావేమో? ఈ ముగ్గురు సమానమే అనే ధర్మ సూక్ష్మం గొప్ప-గొప్ప పండితులకు కూడా తెలియదు. సమస్త చరాచరాలకు ఆత్మయై, హృదయంలో నివసించే ఈశ్వరుడు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Srimadandhra+Valmiki+Ramayanam+Kishkindha+Kanda+Mandara+Makarandam**

* * *